ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

సోమవారం 1 జూలై 2024

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి 8లో..

సీఎండీ బలరామ్‌కు ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డు 8లో..

రగులుతున్న సింగరేణి



- బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణపై భగ్గుభగ్గు
- పోరాటాలకు సిద్ధమైన కార్మిక సంఘాలు
- నేటినుంచి నిరసన ప్రదర్శనలు

గోదావరిఖని, జూన్ 30: సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోల్‌బెల్ట్ ప్రాంతమంతా అట్టుడికిపోతున్నది. సింగరేణి వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఈ అంశంపై రగిలిపోతున్నాయి. శ్రావణ పల్లి, కేకే-6 బ్లాకులను కేంద్ర ప్రభుత్వం వేలం పాటలకు పిలువడంతో సింగరేణి అస్తిత్వమే పోతుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. సింగరేణి పరిధిలో ఉన్న కోయగూడెం, సత్తుపల్లి ఓసీపీ బ్లాకులను ఇప్పటికే బహిరంగ వేలంలో ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు అలాట్ అయ్యాయి. ఇప్పుడు శ్రావణపల్లి ఓసీ, కేకే-5 అండర్‌గ్రౌండ్ గనులకు కేంద్ర ప్రభుత్వం వేలం ప్రకటించింది. ఇప్పటికే సింగరేణి పరిధిలోని తాడిచర్ల ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీంతో సింగరేణి కార్మికవర్గం, కార్మిక సంఘాలు సింగరేణి భవిష్యత్ మొత్తం ప్రైవేట్ కబంధ హస్తాల్లోకి వెళుతుందని ఆందోళన చెందుతున్నారు. శ్రావణపల్లి, కేకే-6 బ్లాకుల వేలంపాటలను వ్యతిరేకిస్తూ సింగరేణి వ్యాప్తంగా కార్మిక సంఘాలు పోరాట కార్యాచరణకు దిగాయి. ఈ బ్లాకులను కేంద్ర ప్రభుత్వం సింగరేణికే కేటాయించాలని సంఘాలు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బ్లాకులను సింగరేణికే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో సింగరేణి సంస్థ కూడా వేలం పాటల్లో పాల్గొనాలని సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఇదిలా ఉండగా సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ మాతృ సంస్థ సీపీఐ బొగ్గు బ్లాకుల వేలం పాటలను వ్యతిరేకిస్తూ జూలై 5న కోల్‌బెల్ట్ బంద్‌కు పిలుపు ఇచ్చింది. ఆ తరువాత దశలవారీ పోటాలకు దిగుతామని ప్రకటించింది. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం పది రోజుల నిరసనలు, పోరాటాలకు సిద్ధమైంది. జూలై 1న సింగరేణి వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ అన్ని స్థాయిల అధికారులకు అన్ని విభాగాల్లో మెమోరాండం ఇవ్వాలని నిర్ణయించింది. 3న సింగరేణి వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చింది. 6న సింగరేణిలోని 11డివిజన్లలో జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నది. 9న గోదావరిఖని కేంద్రంగా నిరసన దీక్షకు సిద్ధపడింది. ఈ దీక్షకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కూడా ఆహ్వానించింది.



ఎవరికి వారుగా పోరాటాలు..

కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ సైతం బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తున్నది. ఈ పాపమంతా అప్పటి బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలదేనని ఆరోపిస్తున్నది. సింగరేణిలోని విప్లవ కార్మిక సంఘాలు ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, హెచ్ఎంఎస్, టీఎన్‌టీయూసీ, అన్ని కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి బొగ్గు బ్లాకుల వేలం పాటలకు వ్యతిరేకంగా ఇప్పటికే సభలు, సమావేశాలు నిర్వహించి కార్మికులను నిరసన కార్యక్రమాలకు సిద్ధం చేస్తున్నాయి. మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ ఏరియా కమిటీ కూడా సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయరాదని, సింగరేణికే ఆ బ్లాకులు కేటాయించాలని ఇదివరకే డిమాండ్ చేసింది. ఈ పరిణా మాలతో సింగరేణిలో అలజడి వాతా వరణం నెలకొన్నది. అయితే బొగ్గు బ్లాకుల వేలం పాటలను అన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ఎవరికి వారుగా పోరాటాలు నిర్వహించడంతో కార్మికులు అయోమయంలో ఉన్నారు. సింగరేణి సంస్థ మనుగడకే విఘాతం కలిగే ఈ అంశంలో కార్మిక సంఘాలు కలిసి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తే బాగుండనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నది. బొగ్గు బ్లాకులను వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎంఎండీఆర్ యాక్టు-2015 చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలానికి సిద్ధప డుతున్నప్పటికీ ఆ చట్టంలోని 17(ఏ)క్లాజు ఖనిజ సంపదకు సంబం. దించిన బ్లాకులను అప్పటికే విషయంలో ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదనే చర్చ కూడా సింగరేణిలో జరుగుతున్నది. మొత్తంగా శ్రావణపల్లి, కేకే-6 బొగ్గు బ్లాకుల వేలం పాటలు ఇప్పుడు సింగరేణిలో మరో పెద్ద ఉద్యమానికి దారితీసే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే సింగరేణిలో మూడు బ్లాకులు ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లాయి. ఈ రెండు కూడా ప్రైవేట్ సంస్థలు చేజిక్కించుకుంటే సింగరేణిలో ప్రైవేట్ శక్తుల ప్రమేయం తీవ్రంగా పెరిగే అవకాశం ఉంది. ఈ పరిణామమే కార్మికవర్గాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది.

ప్రభుత్వానికి సూచనలు అందించి లబ్ధి పొందండి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి



ధూళికట్టలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి

ఎలిగేడు, జూన్ 30 : రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు, సలహాలు అందించి రైతులు లబ్ధి పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి అన్నారు. మండలంలోని ధూళికట్ట రైతు వేదికలో ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని ముప్పిరితోట, లోకపేట, ధూళికట్ట రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రైతుల శ్రేయస్సును కోరి రైతుబంధు ఏర్పాటుచేయగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే పథకానికి రైతు భరోసా అని నామకరణం చేయనుండగా, రాష్ట్ర వ్యాప్తంగా రైతుల అభిప్రాయాలను సేకరించి వారి సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకొని రైతుభరోసా పథకాన్ని ప్రవేశపెట్టబోతుందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ రైతుల మనస్సులో ఉన్న ఆలోచనలకు పదును పెట్టి తగిన సూచనలు సలహాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల అభిప్రాయాలకు, ప్రతి రైతుకు బోనస్ చెల్లించి మద్దతు ధర ప్రకటించాలని కోరారు. బీడు భూములకు రైతుబంధు డబ్బులు ఇవ్వకూడదని సూచించారు. ఐదు నుంచి పది ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి ఇమ్రాన్, సీఈవో రవీం దర్‌రెడ్డి, ఏఈవో పద్మ, వైస్‌చైర్మన్ కంది మల్లారెడ్డి, డైరెక్టర్లు బత్తిని లచ్చయ్య, పొల్సాని పుల్లారావు, కాల్వ సుజాత, కన్నం లక్ష్మీ, కొమ్మ లక్ష్మి, సమ్మయ్య, భూమ య్య, ఎల్లమ్మ, భగవంతరావు, శ్రీనివాస్‌రావు, రాజయ్య పాల్గొన్నారు.

స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన ఏఐవైఎఫ్



మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూన్ 30: రామగుండం మండలం మల్కాపూర్ శివారులోని సర్వే నెం. 83లో సింగరేణి స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్కపురి సూర్య మాట్లాడుతూ సింగరేణి స్థలం కనబడకుండా చుట్టూ చెట్లు నాటి ఓ రెస్టారెంట్ యాజమాన్యం పార్కింగ్ స్థలంగా వాడుకుంటోందని, ఆ స్థలాన్ని కబ్జా చేశారన్నారు. రూ.2కోట్ల విలువ చేసే ఆ భూమి చుట్టూ సింగరేణి యాజమాన్యం ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. సింగరేణి స్థలం కబ్జా అవుతున్నా ఆర్‌జీ-1 జీఎం కానీ, ఎస్టేట్ అధికారులు కానీ స్పందించడం లేదని, సింగరేణిలో అనేక భూములు కబ్జాకు గురవుతున్నాయని, వీటితో ఎస్టేట్ అధికారులకు సంబంధాలున్నాయని ఆయన ఆరోపించారు. సింగరేణి ఏరియాల్లో కార్మికులు చిన్న షెడ్డు వేసుకుంటే కూలగొట్టే ఎస్అండ్‌పీసీ అధికారులు కోట్ల రూపాయల విలువచేసే సింగరేణి భూములు కబ్జా చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆర్‌జీ-1 జీఎంకు ఫోన్‌చేసి సింగరేణి స్థలాన్ని కాపాడాలని ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో తాళ్లపల్లి సురేందర్, నాగరాజు, సురేష్, సుధీర్‌కుమార్ ఉన్నారు.

పేదల సంక్షేమానికి కృషి చేయాలి

- బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్



నాయకులతో కలిసి మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న ఎస్ కుమార్

కళ్యాణ్‌నగర్, జూన్ 30: పేదల సంక్షేమానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ అన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని 79వ బూత్ అధ్యక్షులు రాదండి శ్రీనాథ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రజలు మూడవసారిగా ప్రధానిని చేశారని, ప్రతి ఒక్కరూ అమ్మపేరుతో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షుడు భూమయ్య, విశ్వనాథ్, వీరకుమార్, సమ్మయ్య, సురేష్, శ్రీకాంత్, ప్రవీణ్, సంతోష్, వెంకటేష్, రాజబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎమ్మెల్యే డివిజన్ బాట

కోల్‌సిటీ, జూన్ 30: రామగుండం కార్పొరేషన్‌లో ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి సోమవారం నుంచి ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు, ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొంటారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రతి డివిజన్‌కు వెళుతూ సమస్యల పరిష్కారం కోసం శ్రీకారం చుడుతున్నారని, ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సింగరేణి, విద్యుత్, హెల్త్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ అధికారులు పాల్గొంటారని, ప్రజల తమ సమస్యలను చెబితే అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. సోమవారం 38వ డివిజన్ ఇందిరానగర్‌లో ఉదయం 10గంటలకు ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

సుల్తానాబాద్ మండలంలో వ్యవసాయ పనులు షురూ

- నాట్లకు మడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- 26 వేల ఎకరాల్లో వరి సాగు అంచనా



నాట్లకు సిద్ధంగా ఉన్న నారుమడులు

సుల్తానాబాద్, జూన్ 30: సుల్తానాబాద్ ప్రస్తు వానాకాలం సీజన్‌కు సంబంధించిన వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. నాట్లు వేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. బావులు, చెరువుల పారకం గలవారు వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. పొలాల మడుల్లో నీరు నింపి కొన్ని తర్వాత వాటిని దున్ని నాట్ల కోసం సిద్ధంచేసుకొని ఉంచారు. నాట్లు వేసేందుకు అవసరమైన నారును పెంచుకున్నారు. మండలంలోని 27 గ్రామాల్లో ఎక్కువగా రైతులు వరి సాగును ఎంచుకున్నారు. వానాకాలం సీజన్‌కు తగిన వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించామని, రైతులు సాగుచేయబోయే పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆయా గ్రామాల రైతులకు అందుబాటులో వాటిని సిద్ధం చేశామని వ్యవసాయ అధికారులు తెలిపారు. దళారులు విక్రయించే విత్తనాలను రైతులు కొనవద్దని, ప్రభుత్వ లైసెన్సు పొందిన విత్తన డీలర్ వద్దనే వాటిని కొనుగోలు చేయాలని సూచించారు.

మందుబాబులకు అడ్డాగా రైతు వేదిక

- రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు - పెగడపల్లిలో గుర్తు తెలియని వ్యక్తుల ఆగడాలు



పెగడపల్లిలోని రైతు వేదిక



రైతు వేదికలో గుర్తుతెలియని వ్యక్తులు విరగ్గొట్టిన కుర్చీలు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 30: మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఉన్న రైతు వేదిక మందుబాబులకు అడ్డాగా మారింది. రైతు వేదిక గ్రామంలో మెయిన్ రోడ్ పక్కనే ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిపూట రైతు వేదిక వద్ద కూర్చొని మందు తాగుతున్నారు. తాగిన ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులు రైతు వేదిక వద్దే వదిలేసి పోతున్నారు. ఖాళీ మద్యం సీసాలను రైతు వేదిక వద్దకు వచ్చిన వారే తొలగించాల్సి వస్తోందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పెగడపల్లిలో నిర్మించిన రైతు వేదికలోనే వ్యవసాయ శాఖ ఏఈవో ప్రతిరోజు ఉదయం 9.30గంటల నుంచి 4గంటల వరకు ఉండి అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఈ రైతు వేదిక పెగడపల్లితో పాటు గంగారం, మడిపల్లి, మడిపల్లి కాలనీ, అంకంపల్లి, ఆశన్నపల్లి గ్రామాలకు చెందిన రైతులు వారి సమస్యల పరిష్కారం కోసం ఏఈవోను రైతు వేదిక వద్దకు వచ్చి సంప్రదిస్తుంటారు. రైతులకు భూములలో ఏ పంటలు వేయాలి, వేసిన పంటలలో పురుగు మందులు, ఎరువులు ఇతరత్రా విషయాల గురించి వేదికలో రైతులతో సమావేశం నిర్వహిస్తుంటారు. ప్రభుత్వం నిర్మించిన ఈ రైతు వేదిక చుట్టూ మందుబాబులు రాత్రిపూట మద్యం తాగి ఖాళీ సీసాలను పగలగొట్టి అక్కడనే పడవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత వ్యవసాయ అధికారులు గ్రామ పంచాయతీ దృష్టికి కూడా తీసుకపోవడం జరిగిందన్నారు. దీంతో పాటు రైతు వేదిక స్థలంలో బయట ఉన్న మరుగుదొడ్లల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిపూట మద్యం తాగి రైతు వేదికలో ఉన్న కుర్చీలను ఇనుపరాడ్‌తో కిటికీల ద్వారా పగులగొట్టారని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. రైతు వేదిక తాళంను కూడా పగులగొట్టే ప్రయత్నం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

రైతుల ఉపయోగం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ రైతు వేదిక మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా రామునిపల్లి రోడ్డు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- వాహనదారుల ఇబ్బందులు



గుంతలమయమైన రామునిపల్లి రోడ్డు



రామునిపల్లి రోడ్డు మధ్యలో గొయ్యి

సుల్తానాబాద్, జూన్ 30: సుల్తానాబాద్ మండలంలోని రామునిపల్లి-రేగడిమద్దికుంట రోడ్డు ప్రమాదరకంగా మారింది. ఈ రోడ్డులో రెండు చోట్ల పెద్దపెద్ద గోతులు ఉండి వాహనచోదకులకు ఆటంకాలుగా ఉన్నాయి. రెండు మూడు సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా ఈ రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. దాంతో వాహనాల ద్వారా వచ్చేవారు ఇక్కడ తరచూ ప్రమాదాల పాలవుతున్నారు. సుల్తానాబాద్ మండలంలోని రామునిపల్లి గ్రామం మీదుగా రేగడిమద్దికుంట ద్వారా ఇటు కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి, గంగారం తదితర గ్రామాలకు అటు సుద్దాల, కదంబాపూర్, సుల్తానాబాద్ వెళ్లే ప్రధాన రహదారిని చేరుకుంటారు. ఈ రోడ్డు ప్రాధాన్యత దృష్ట్యా రాజీవ్ రహదారి నుంచి కాల్వశ్రీరాంపూర్, ఓదెల, పొత్కపల్లి, జమ్మికుంట తదితర కేంద్రాలకు వెళ్లడం కోసం గర్రెపల్లి, బొంతకుంటపల్లి, నీరుకుళ్ళ, గట్టేపల్లి, కదంబాపూర్, తొగర్రాయి మీదుగా కనుకుల, రామునిపల్లి ద్వారా రేగడిమద్దికుంట వరకు లింక్ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. కొన్నిచోట్ల పూర్తికాగా, మరికొన్ని అసలు పనులు ప్రారంభం కాలేదు. దాంతో ప్రస్తుతం రామునిపల్లి నుంచి మద్దికుంట రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. రామునిపల్లి గ్రామ మొదట్లోనే రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి అడ్డంగా ఉంది. ఈ గొయ్యి రోడ్డుకు సగానికి పైగా అలానే ఉంది. ఈ క్రాసింగ్ వద్ద ఈ గొయ్యి వాహనాల వారు గమనించలేకపోతున్నారు. దాంతో అందులో పడిపోతున్నారు. వాహనాలు ప్రమాదాల పాలవుతున్నాయి. ఈ ప్రమాదకర క్రాసింగ్‌ను దాటిన తర్వాత నడిరోడ్డుపై మరో గొయ్యి ఉంటుంది. రోడ్డు మధ్యలో సగానికి పైగా కోతకు గురైంది. ఈ రోడ్డులో రెండు చోట్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా రామునిపల్లి రోడ్డులోని ప్రమాదకరంగా ఉన్న గోతులను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం..

- మల్యాల శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్

ప్రమాదకరంగా ఉన్న రామునిపల్లి రోడ్డు గురించి ఇటీవల ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకువెళ్లాం. రోడ్డు నిర్మాణం ఆవశ్యకతను వివరించాం. కొత్త రోడ్డు వేయించేందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే ఆదేశం మేరకు కాంట్రాక్టర్ వచ్చి రోడ్డును పరిశీలించారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభం అవుతాయి.

వైభవంగా పోచమ్మ బోనాలు




ఇల్లంతకుంటలో బోనాలతో మహిళలు, సిరిసిల్లలో బోనమెత్తుకున్న మహిళలు

సిరిసిల్ల టౌన్ జూన్ 30: వర్షాలు సమృద్ధిగా కురిపించు.. పిల్లాపాపలను సల్లంగా చూడు పోచమ్మ తల్లి అంటూ మహిళలు బోనం ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం 15వ వార్డు కౌన్సిలర్ ఆకునూరి విజయనిర్మల బాలరాజు ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. వార్డు మహిళలు అంబేద్కర్ చౌరస్తా నుండి పోచమ్మ దేవాలయం వరకు బోనాలు ఎత్తుకొని దేవాలయంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, వార్డు నాయకులు, మహిళలు యువకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోణాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నట్లు సంఘ నాయకులు తెలిపారు.

● వడుకాపూర్‌లో మడేలేశ్వరస్వామి బోనాలు..

జూలపల్లి: మండలంలోని వడుకాపూర్‌లో ఆదివారం రజక కులస్తుల ఆధ్వర్యంలో వారి ఆరాధ్యదైవమైన మడేలేశ్వరస్వామి బోనాల వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మడేలేశ్వరస్వామి వేడుకలను పురస్కరించుకుని మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించేందుకు డప్పుచప్పుల్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆయలయంలో స్వామివారికి బెల్లం సాకం, నైవేద్యం, సమర్పించి తమ పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. వైస్ ఎంపీపీ మొగురం రమేష్, మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్ పాల్గొని బోనాలతో ఆలయాలనికి తరలివెల్లి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రజక కుల నాయకులు ఎర్రోల్ల రాములు, కూనరాజుల లచ్చన్న, కూనరాజుల రాజన్న, కూనరాజుల శంకరయ్య, మల్లయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వడుకాపూర్‌లో..

రోడ్డుపైనే మురుగు నీరు.. ఇళ్లలోకి విషపురుగులు

- ఇబ్బందిపడుతున్న ప్రజలు - భయాందోళనలో కాలనీవాసులు




మల్లాపూర్‌లో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీటిలో నుంచి నడుచుకుంటు వెళుతున్న స్థానికులు, పేరుకుపోయిన మురుగు

తిమ్మాపూర్, జూన్ 30: మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని 5వ వార్డులో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామం ప్రారంభం నుంచి శివారు గుట్ట ప్రాంతం వరకు డ్రైనేజీని నిర్మించారు. అయితే గత పాలకుల అధికారుల సహాయంతో స్థానికంగా ఉన్న కొంత వ్యవసాయ భూమిని కొందరు ప్లాట్లుగా చేసి ఎలాంటి నాలా అనుమతులు లేకుండానే విక్రయించారు. అనంతరం ప్లాట్లను కొనుగోలు చేసిన వారు అందులో ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో కొనుగోలు చేసిన ప్లాట్లు రోడ్డుకు చాలా లోతుగా ఉండటంతో రోడ్డుకు ఎత్తుగా మట్టితో పూడ్చుతున్నారు. గతంలో మురుగు నీరు అంతా ఓ ఖాళీ ప్రదేశానికి తరలించేవారు. అయితే ప్రస్తుతం ఇళ్ల నిర్మించుకోవడంతో మురుగు నీరు బయటకు వెళ్లకుండా అడ్డుగా మట్టి పడటంతో రోడ్ల మీద ప్రవహిస్తున్నాయి, దీనికి తోడు ఇప్పుడు వర్షాలు కూడా కురుస్తుండటంతో మురుగు నీరు, వర్షం నీరు కలిసి రోడ్ల మీద నుండి ప్రవహించడమే కాకుండా ఇళ్లలోని వచ్చి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నెలల తరబడి నీరు నిలిచి ఉండటంతో స్థానికంగా దుర్గంధం, దోమల కారణంగా విషజ్వరాలు వస్తున్నాయని అంటున్నారు. అంతేకాకుండా ఇళ్లలోని విష క్రిమికీటకాలు, చెత్త ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని భయంతో కాలం వెళ్లదీస్తున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. దీనిపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకునే వారే లేరని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఐదో వార్డులో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు, వర్షపు నీరు

అధికారులు పట్టించుకోవడం లేదు

- హరికృష్ణ, మల్లాపూర్ గ్రామం



మల్లాపూర్‌లోని ఐదో వార్డులో ఉన్న సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వ్యవసాయ భూమిని ఎలాంటి నాలా పర్మిషన్ లేకుండానే విక్రయించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఆ ప్లాట్లు రోడ్లుకు లోతుగా ఉండటం వల్ల కిందికి మురికి నీరు వెళ్లకుండా నిలిచిపోయి రోడ్ల పైకి, ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం అయింది. మురికి కాలువ నీరు, వర్షపు నీరు కలిసి ఇళ్లలోకి వస్తున్నాయి. పాములు, కప్పలు, చెత్త ఇళ్లలోకి చేరి దుర్గంధం, దోమలతో ఉండలేకపోతున్నాం. అధికారులకు చాలాసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

ముదిరిన పోడుభూమి వివాదం

- ఇరువర్గాల మధ్య ఘర్షణ

వీర్నపల్లి, జూన్ 30: పోడు భూముల వివాదం ఇరువర్గాల గిరిజనుల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు కర్రలతో, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా తలలు పగిలి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన వీర్నపల్లి మండలం భూక్యతండా పరిధిలోని రాసిగుట్ట తండా అటవీ భూముల్లో ఆదివారం సాయంత్రం జరిగింది. అదే గ్రామానికి చెందిన భూక్య సరియా నాలుగెకరాలు, లకావత్ వసంత్ 1.20 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం వీరికి పోడు పట్టాలను అందించింది. ఇద్దరికి సరిహద్దు విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతుండగా గ్రామస్థులు హద్దులను చూపించినా వివాదం సద్దుమనగలేదు. ఆదివారం లకావత్ వసంత్ ఆయన కుమారులు రవి, తిరుపతి, భూక్య సరియా ఆయన కుమారుడు నవీన్, తమ్ముడు మోహన్ సాగు చేసుకుంటున్న భూముల వద్దకు వెళ్లి హద్దుల విషయంలో మాటమాట పెరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దాడిలో వసంత్, తిరుపతి, నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. ఇరువర్గాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో చికిత్స నిమిత్తం పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల నుంచి ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్ తెలిపారు.

దుర్గామాత ఆలయంలో చోరీ



జాగిలాలతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చందుర్తి, జూన్ 30: చందుర్తి మండల కేంద్రం శివారులోని నవరత్నాల దుర్గామాత ఆలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఆలయ పూజారి మురళి రోజు మాదిరిగానే ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా ఆలయం తాళం పగలగొట్టి ఉంది. వెంటనే పూజారి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. కమిటీ సభ్యులు వచ్చి ఆలయంలోకి వెళ్లి చూడగా దుర్గామాతపై ఉండవలసిన పావు తులం పుస్తెలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జాగిలాలతో చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. ఈ సంఘటనపై విచారణ జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎట్టకేలకు 'సూరమ్మ' పనులు ప్రారంభం

- రు. 80 కోట్లు విడుదల చేసిన సర్కారు
- మత్తడి, తూముల పనులు వేగవంతం

కథలాపూర్, జూన్ 30: అధికార, ప్రతిపక్షాల మధ్య గడిచిన పదేళ్ళ నుంచి హోరాహోరీగా సాగిన వాదనలు, నిరసనల నేపథ్యంలో ఎట్టకేలకు సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులు ప్రారంభమయ్యాయి. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు 80 కోట్ల రూపాయలు విడుదల చేసిన క్రమంలో కాంట్రాక్టర్ ముందుకు రావడం వల్ల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఏళ్ళ తరబడి పనులు పెండింగ్‌లో పడిపోగా ప్రస్తుతం కొనసాగుతున్న పనులతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

• ముమ్మరమైన మత్తడి, తూముల పనులు..

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్ 1, ఫేజ్ 2 లో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రు. 1,688 కోట్లతో ప్యాకేజీ కింద పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి సూరమ్మ చెరువును పంపింగ్ ద్వారా నింపాలని ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించారు. తెలంగాణ ఏర్పడ్డ అనంతరం నిధుల కొరత కారణంగా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

ఈ ప్యాకేజీ పనులను ఐవీఆర్‌సీఈఎల్, ఎస్ఈడబ్ల్యు, నవయుగ కంపెనీలు సంయుక్తంగా చేపడుతున్నాయి. సూరమ్మ ప్రాజెక్ట్‌కు సంబంధించి సబ్‌కాంట్రాక్టర్ పనులు చేపడుతుండగా నిధుల కేటాయింపులో విపరీత జాప్యం వల్ల పనులను అర్థాంతరంగా నిలిపివేశాడు. దీంతో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరో వైపు బీజేపీ శ్రేణులు రకరకాల నిరసనలు చేపట్టారు.





పనులు పరిశీలిస్తున్న అధికారులు, కొనసాగుతున్న కట్ట నిర్మాణ పనులు

మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల వరప్రదాయినిగా ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో నీరు నిల్వ ఉంటే 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరుట్ల దాకా భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ప్రతీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సూరమ్మ చెరువు ఓ ప్రచారాస్త్రంగా ఉండేది. తమ ప్రభుత్వం రాగానే పనులు ప్రారంభించేలా చేస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇవ్వగా పెండింగ్‌లో ఉన్న రు. 80 కోట్ల నిధులను విడుదల చేయించడంలో సఫలీకృతులయ్యారు.

85 మీటర్ల మేర మత్తడి, పాత తూము తొలగించి మరమ్మతుతో పాటు మరో తూము కొత్తగా నిర్మాణం చేపడుతున్నారు. సూరమ్మ చెరువు గత ఏడాది వర్షాలకు పుష్కలంగా నిండినప్పటికీ మత్తడి కోతకు గురై నీరంతా వృధాగా పోయింది.

• పనులు నిరంతరం కొనసాగిస్తున్నాం..

కార్తీక్, ఏఈ ఇరిగేషన్



ఉన్నతాధికారుల నుంచి పనులు నిరంతరం కొనసాగించాలని ఆదేశాలు రావడంతో పని ప్రదేశం వద్దే ఉండి నిరంతరం పనులు చేపడుతున్నాం. మత్తడి, తూముల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతు న్నాయి. కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులను వెన్సా కంపెనీ సుమారు రు. 199 కోట్లతో దక్కించుకుంది. 524 ఎకరాల మేర రైతులు భూములు కోల్పోతున్నారు. నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తయితే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

రాజన్న ఆలయ
ఇన్‌చార్జి ఈవోగా వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జూన్ 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వినోద్‌రెడ్డిని నియమిస్తూ ఆదివారం దేవదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ఈవోగా పని చేసిన ఆర్‌జేసీ రామకృష్ణ ఆదివారం వరకు విధులు నిర్వర్తించి రిలీవ్‌పై వెళ్లారు. సికింద్రాబాద్ గణేష్ దేవాలయం ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న వినోద్‌రెడ్డిని ప్రస్తుతం రాజన్న ఆలయ ఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూన్ 30: మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో ఆదివారం బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన తొట్ల రాజయ్య ఆముదాలపల్లి వారసంతకు కూరగాయల కోసం వెళ్లాడు. ఆముదాలపల్లి క్రాస్ వద్ద రోడ్డు పక్కకు నిల్చుని ఉన్న రాజయ్యను వీణవంక నుంచి కేశవపట్నం వైపు వెళ్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజయ్యను 108 వాహనంలో హుజూరాబాద్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

అదుపు తప్పి ఆటో బోల్తా: వృద్ధురాలి మృతి

- ఏడుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 30: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట లో ప్రయాణికులతో వెళుతున్న ఆటో ఆదివారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన వృద్ధురాలు బొడ్డు చంద్రవ్వ (60) మృతి చెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న రాజన్నపేట, అల్మాస్‌పూర్ వాసులు ముక్క లక్ష్మి, నమిలికొండ లావణ్య, శివరాత్రి ఇందు, స్వప్న, వాహన డ్రైవర్ బత్తుల రవితో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఏడుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని గొల్లపల్లి గ్రామం నుంచి 15 మంది ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని డ్రైవర్ బత్తుల రవి అల్మాస్‌పూర్ వైపునకు బయలుదేరాడు. రాజన్నపేట గ్రామంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొడ్డు చంద్రవ్వ, రాజన్నపేటలోని తన బంధువు ముక్క లక్ష్మితో కలిసి రాజన్నపేటకు ఆటోలో వెళుతున్నారు. ఒక్కసారిగా ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న చంద్రవ్వ, లక్ష్మి, లావణ్య, ఇందు, స్వప్న, వాహన డ్రైవర్ రవితో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో చంద్రవ్వ చనిపోయింది. లక్ష్మి, లావణ్య, ఇందు, స్వప్న, రవితో పాటు మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ బత్తుల రవి మద్యం మత్తులో వాహనాన్ని అతి వేగంగా నడపడంతో ప్రమాదం చోటు చేసుకుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆసుపత్రికి చేరుకున్నారు. గాయాలపాలైన వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. క్షతగాత్రులను పరామర్శించారు.



బోల్తాపడిన ఆటో, ఇన్‌సెట్‌లో చంద్రవ్వ మృతదేహం

చట్టవ్యతిరేకంగా శిశువును దత్తత తీసుకున్న దంపతులు

- శిశుగృహకు శిశువు తరలింపు, కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 30: నిబంధనలకు విరుద్ధంగా కేవలం నోటరీ చేయించుకుని ఒక శిశువును దత్తత తీసుకున్న విషయంపై కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి, ఆ శిశువును స్వాధీనం చేసుకుని సంరక్షణార్థం కరీంనగర్ శిశుగృహకు తరలించారు. బాలల సంరక్షణ సమితి అధికారులు, కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సంతానం లేనివారు ఎవరైనా జిల్లా బాలల సంరక్షణ సమితికి దరఖాస్తు చేసుకుని ఆ శాఖ ద్వారా పిల్లలను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. ఆ నిబంధనలు పాటించకుండా కరీంనగర్‌లోని హరిహరనగర్‌కు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయ దంపతులు వారికి సంతానం లేకపోవటంతో మాతాశిశు ఆసుపత్రిలో జన్మించిన 14 రోజుల శిశువును ఇద్దరు మధ్యవర్తుల సహకారంతో తల్లిదండ్రులతో నోటరీ రాయించుకుని దత్తత తీసుకున్నారు. దీనిపై బాలల సంరక్షణ సమితికి ఫిర్యాదు రాగా అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరీంనగర్‌కు చెందిన ఒడ్డెపల్లి ఆంజనేయులు భార్య గొంటి మౌనికకు జనవరి 31న కరీంనగర్ మాతాశిశు ఆసుపత్రిలో ఆడ శిశువు జన్మించింది. అయితే ఆ శిశువును పోషించే స్తోమత లేదని మాతాశిశు ఆసుపత్రిలోని సెక్యూరిటీగార్డు కక్కర్ల పర్శరాంకు శిశువు తండ్రి తెలిపాడు. ఈ విషయం పర్శరాం అతని స్నేహితుడు చెరుకు రవీందర్‌రెడ్డికి తెలపగా అతడి బావ అయిన లింగాల రాజిరెడ్డి దంపతులకు చెప్పాడు. ఆ శిశువును తాము దత్తత తీసుకుంటామని మధ్యవర్తులు పర్శరాం, రవీందర్‌రెడ్డిలకు తెలపటంతో వారు శిశువు తండ్రి ఆంజనేయులుతో మాట్లాడి అడ్వకేట్ వద్ద నోటరీ రాయించుకుని శిశువును దత్తత తీసుకున్నారు. కొద్ది నెలల తరువాత ఆంజనేయులు తన కూతురు తనకే కావాలని మధ్యవర్తులను అడగడంతో ఈ విషయం బయటకు పొక్కి బాలల సంరక్షణ సమితికి ఫిర్యాదు అందింది. ఈ నెల 29న బాలల సంరక్షణ సమితి అధికారులు శిశువు దత్తత తీసుకున్న దంపతుల వద్దకు వెళ్లి విచారణ జరపగా తాము నోటరీ ద్వారా దత్తత తీసుకున్నామని తెలిపారు. శిశువు దత్తత అనేది నోటరీ ద్వారా చెల్లదని ఆ శిశువును ఆదివారం కరీంనగర్ రెండో ఠాణాకు తీసుకువచ్చారు. శిశువును సంరక్షణార్థం శిశుగృహకు తరలిస్తామని సీఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా శిశువును దత్తత తీసుకున్న రవిందర్, దత్తత ఇచ్చిన దంపతులు, మధ్యవర్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. కాగా ఆంజనేయులు తన 14 రోజుల కూతురును దత్తత ఇచ్చేందుకు కొంత మొత్తం డబ్బులు తీసుకున్నట్లు సమచారం. మళ్లీ మరికొన్ని డబ్బులు కావాలని మధ్యవర్తులకు ఫోన్ చేసి వేధిస్తుండటంతో వారు బాలల సంరక్షణాధికారులకు ఫోన్ చేసి విషయం తెలిపారని తెలిసింది.

తహసీల్దార్, మరో ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

పెద్దపల్లి రూరల్, జూన్ 30: ఓ భూమి విషయంలో ఒక తహసీల్దార్‌తో పాటు మరో ఇద్దరిపై చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు అయింది. వివరాల్లోకి వెళితే పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామ మాజీ సర్పంచ్ గర్రెపల్లి విశ్వనాథంకు చెందిన సర్వే నెంబర్ 669లో గల 6 గుంటల భూమిని గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటేషం, కారుపాకల సంపత్ కుమార్ పేరున కార్యాలయ ఇన్‌వార్డ్ నెంబర్ ఫైల్ ప్రాసెస్ లేకుండానే అక్రమంగా 2011-12లో అప్పటి తహసీల్దార్ పట్టా చేశారని కోర్టును బాధితుడు ఆశ్రయించాడు. విచారణ అనంతరం కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురుపై పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ ఐపీసీ 420, 468, 471, క్రైం నంబర్ 277/2024 పెద్దపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు పెద్దపల్లి మండలంలో ఫోర్జరి, చీటింగ్ కేసు సంబంధించిన విషయాల్లో అధికారులపై కేసు నమోదు అయిన దాఖలాలు లేవు. కోర్టును ఆశ్రయించడం వల్ల తగిన న్యాయం జరిగిందని బాధితుడు హర్షం వ్యక్తం చేశాడు.

తహసీల్దార్, 12 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

పెద్దపల్లి రూరల్, జూన్ 30: ఓ భూమి విషయంలో తహసీల్దార్‌తోపాటు మరో 12 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు అయింది. మండలంలోని పెద్దబొంకూర్ గ్రామ పంచాయతీ పరిధిలో చిన్నకల్వల గ్రామానికి చెందిన కలువల శంకర్‌కు సర్వే నంబర్ 478/డి లో ఎకరం ఐదు గుంటల భూమి ఉంది. అయితే ఆ భూమిలో నుంచి ఎనిమిది గుంటల భూమిని కల్వల శంకరయ్య పేరును ఇన్‌వార్డు నంబర్ ఫైల్ లేకుండానే అక్రమంగా తహసీల్దార్ పట్టా చేశారని బాధితుడు కలువల శంకర్ పేర్కొన్నాడు. పలుమార్లు కలెక్టర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగిన న్యాయం జరగక పోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు శంకర్ తెలిపారు. కోర్టు తీర్పునివ్వడంతో పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో తహసీల్దార్‌తో పాటు మరో 12 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి, ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు అయినట్లు బాధితుడు శంకర్ తెలిపారు.

బైక్ పైనుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 30: బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గంగారం గ్రామశివారులో జరిగింది. ఆదివారం పెద్దపెల్లి మండలం మారేడుగొండకు చెందిన కమటం రమేష్(26) కాల్వ శ్రీరాంపూర్ నుండి మారేడుగొండకు బైక్‌పై వెళుతుండగా గంగారం గ్రామ శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో రమేష్ తలకు తీవ్ర గాయాలైనాయి. సంఘటనా స్థలానికి వెళ్ళిన పోలీసులు ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని చావు బతుకుల్లో ఉన్న రమేష్‌ను 108 ద్వారా మెరుగైన వైద్యం కోసం పెద్దపెల్లికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన నరసింహుడి సన్నిధి





స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచిఉన్న భక్తులు, శ్రీనివాసాచారి దంపతులను స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సీనియర్ అసిస్టెంట్

ధర్మపురి, జూన్ 30: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం తోడుగా జేష్ఠ బహుళ నవమి కావడంవల్ల లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులు లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టికెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతిధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

• మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ పూజలు..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసాచారి దంపతులు ఆదివారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం మంగళ వాయిద్యాలు వెంట రాగా వేదపండితులు, అర్చకులు, సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి నరసింహమూర్తి వారిని ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి బహూకరించి వారిని సత్కరించారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. వారి వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ ముత్యపు బుచ్చన్న, రాజ్‌కుమార్, శ్రీనివాస్, అర్చకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

• సెల్ ఫోన్‌ను భక్తుడికి అప్పగించిన ఉద్యోగి..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఒక భక్తుడు సెల్ ఫోన్ పోగొట్టుకోగా సిబ్బంది వెతికి ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ద్వారా ఆదివారం బాధితుడికి అప్పగించారు. నాందేడ్‌కు చెందిన హృదయ్‌నాథ్ దూబె స్థానిక లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం వచ్చారు. ఉదయం దైవ దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో తనకు సంబంధించిన రూ 25,000 విలువ గల సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆ సెల్ ఫోన్ సెక్యూరిటీ సిబ్బందికి అభిషేకం మండపంలో దొరకడం వల్ల విచారణ జరిపి ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ భక్తుడికి అప్పగించారు. భక్తుడు ఆలయ సిబ్బందితో పాటు సీనియర్ అసిస్టెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



చెక్ డ్యాం కట్టపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వీణవంక, జూన్ 30: మండలంలోని రామ్మకృష్ణాపూర్‌లో వాగులో నిర్మించిన చెక్ డ్యాం కట్ట గతంలో కురిసిన భారీ వర్షాలకు తెగిపోవడంతో కట్ట పూర్తిగా తెగిపోయింది. రానున్నా వర్షకాలం దృష్ట్యా కాంట్రాక్టర్ కరకట్ట నిర్మాణం చేపట్టడంతో కట్టకు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మట్టి పోయడంతో ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ భూమి లెవల్‌కు ఉండడంతో పశువులకు రైతులకు ప్రమాదకరంగా మారిందని తెలిపారు. రైతులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఇరిగేషన్ అధికారుల తప్పిదంతో ప్రమాదకరంగా మారిందని తెలిపారు.

ఇసుక లారీ, ఎక్స్‌కవేటర్ పట్టివేత

తిమ్మాపూర్, జూన్ 30: మండలంలోని కొత్తపల్లి గ్రామం మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు ఒక ఇసుక టిప్పర్, జేసీబిని స్వాధినం చేసుకున్నారు. పోలీసులను గమనించిన టిప్పర్ డ్రైవర్ టిప్పర్‌ను అక్కడే వదిలేసి పారిపోగా టిప్పర్ ను జేసిబిని పట్టుకున్నట్లు డ్రైవర్ సుంచు హర్షవర్ధన్, జేసిబి డ్రైవర్ మారపల్లి సాయి కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎల్ఎండి పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తి అరెస్ట్

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 30: పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్పించడమే కాకుండా దాడికి పాల్పడిన ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ తండాకు చెందిన భూక్య గురుబాబు (30) అనే వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రటనలో తెలిపారు. నిందితునిపై గతంలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో 21 కేసులతో పాటు ఒక మర్డర్ కేసు ఉండడంతో రౌడీ షీట్ ఓపెన్ చేశామన్నారు. ఈనెల 26న రాత్రి రామలక్ష్మణపల్లి గ్రామ శివారులోని మానేరువాగులో బాబుకు చెందిన ట్రాక్టర్‌లో డ్రైవర్ ప్రశాంత్ ఇసుక నింపుకొని దుబ్బాక వైపు వెలుతున్నాడు. ఈ క్రమంలో నామాపూర్‌చెరువు కట్టపై పోలీసులు ఆ ట్రాక్టర్‌ను పట్టుకోగా ట్రాక్టర్ యజమాని బాబు అక్కడికి చేరుకొని మళ్లీ ట్రాక్టర్ సీజ్‌చేస్తారని వెంటనే ట్రాక్టర్‌ను డ్రైవర్ వద్ద నుంచి తీసుకొని తన ట్రాక్టర్‌కు అడ్డురావదద్దని హెచ్చరిస్తూ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సత్యానారాయణను గాయపరిచి పారిపోయినట్లు ఎస్పీ తెలిపారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న బాబును నామాపూర్ శివారులో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇతనిపై ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో 14 కేసులు, తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, వేములవాడ టౌన్, గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు, సిద్దిపేట జిల్లా దుబ్బాక పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కేసులతో పాటు ఒక మర్డర్ కేసులో రౌడీ షీట్ ఓపెన్ చేశామని ఆయన తెలిపారు.

బావిలో పడిన పిల్లిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

సిరిసిల్ల క్రైం, జూన్ 30: సిరిసిల్ల పట్టణంలోని శివాలయం సమీపంలో గల ఓ ఇంట్లోని చేదబావిలో పిల్లి పడింది. పిల్లిని రక్షించుమని ఇంటి యజమాని మోహనమూర్తి ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వచ్చిన అగ్నిమాపక సిబ్బంది బావిలో పడిన పిల్లిని బయటకు తీసి కాపాడారు. రెస్క్యూ చేసిన అగ్నిమాపక సిబ్బందికి ఇంటి యజమాని కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



పెగడపల్లి, జూన్ 30 : పెగడపల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన ముంజ రాజు (31) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంజ రాజు ఈ నెల 26న బతికెపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు రాజు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

భక్తుల మనోభావాలను గౌరవించేందుకు చర్యలు

- రాజన్న ఆలయంలో కోడెలు ఎంతో ప్రాముఖ్యం గలవి
- సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారికి ఎంతో ప్రేమతో నిజ కోడెలు సమర్పించే భక్తుల మనోభావాలను గౌరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి తిప్పాపూర్ గోశాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా గోశాలలోని కోడెల స్థితిగతులను, పిచ్చి గడ్డిని, సోయాబీన్, పల్లిపిండి, తవుడుతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓఎస్‌డీ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రాజన్న ఆలయంలోని గోశాలను సందర్శించానని అన్నారు. రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించే కోడెలు ఎంతో ప్రాముఖ్యత గలవని సీఎం ప్రత్యేకంగా చెప్పడంతోనే సందర్శించినట్టు తెలిపారు. ఇప్పటికే గోశాలను ఎండోమెంట్ కమిషనర్ విజిట్ చేశారని, నాలుగు వందలు ఉండే గోశాలలో 1500 పైగా కోడెలు ఉంటున్నాయని అన్నారు. కొంత అనారోగ్యం కారణంగా కోడెలు మృతి చెందుతున్నాయన్నారు. బురద నీరు లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం, కొత్త షెడ్డుల నిర్మాణాల కోసం ఆదేశాలు జారీ అయ్యాయని అన్నారు. గోశాల ఆధునికీకరణ కోసం మరిన్ని నిధులు వెచ్చిస్తున్నామని, కోడెల సంరక్షణ కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గోశాలలోనే కోడెలను రైతులకు అందించేందుకు ప్రయత్నం జరుగుతుందని అన్నారు. గోశాలకు పర్మినెంట్‌గా వైద్యులను, సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.





తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలను పరిశీలిస్తున్న సీఎం ఓఎస్‌డీ, ఆలయ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఓఎస్‌డీ, ప్రభుత్వ విప్

• ఆలయ అభివృద్ధికి సీఎం పట్టుదలతో ఉన్నారు..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న ఆలయాభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఐదు నెలల క్రితమే రాజన్న ఆలయం, గోశాల అభివృద్ధి కోసం రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో గతంలో వెనక్కి వెళ్లిన వీటీడీఏ నిధులు రూ. 20 కోట్లు తిరిగి తెప్పించామన్నారు. ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరిగిందని అన్నారు. రాజన్న కోడె మొక్కులు చెల్లించుకునే భక్తులు ఆరోగ్యంగా, పాలు మరిచిన, నిర్ణీత వయస్సు నిండిన కోడెలను మాత్రమే సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, రావేశ్వరావు, ఏఈవో ప్రతాప నవీన్, హరికిషన్, జయకుమారి, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, సూపరిండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, తిరుపతిరావు, నటరాజ్, నాగుల మహేష్, ఎడ్ల శివసాయి తదితరులు ఉన్నారు.

• రాజన్నను దర్శించుకున్న సీఎం ఓఎస్‌డీ

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. రాజన్న దర్శనానికి వచ్చిన ఆయన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్న ఆలయానికి విచ్చేయగా ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం స్వామి వారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో రామకృష్ణ రాజన్న ప్రసాదాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.

కొండ చిలువ కలకలం

• భయాందోళనలో ప్రజలు

శంకరపట్నం, జూన్ 30: శంకరపట్నం మండలంలోని కాచాపూర్‌లో ఆదివారం ఇళ్ల మధ్య కొండ చిలువ కలకలం రేపింది. కాచాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయ సమీపంలో మాల కాలనీకి వెళ్లే దారిలో ఆదివారం ఓ కొండ చిలువ పిల్లిని పట్టుకొని మింగుతుండగా ఓ మహిళ ప్రత్యక్షంగా చూసిన సంఘటన జరిగింది. మహిళ తన ఇంటి పక్కన ఉన్న సీసీ రోడ్ వైపు కరివేపాకు కోసం వెళ్తుండగా కొండ చిలువ పిల్లిని పట్టుకున్న ఘటన చూసి భయాందోళనకు లోనైంది. వెంటనే ఆ మహిళ కేకల వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొని కొండ చిలువ నోట్లో నుంచి పిల్లిని విడిపించారు. పిల్లి అప్పటికే మృతి చెందింది. స్థానికులు కొండ చిలువను సమీపంలో ఉన్న గుట్టల వద్ద వదిలి పెట్టినట్లు తెలిపారు. కొండ చిలువ గ్రామంలో ఇళ్ల మధ్య కనిపించడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు.



రెస్క్యూ జీఎంగా శ్రీనివాసరెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 30: సింగరేణి రెస్క్యూ జీఎంగా కే శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు రిటైర్ కావడంతో ఆయన స్థానంలో శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది. శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లె గ్రూప్ ఏజెంట్‌గా ఉన్నారు. ఆదివారం జీఎం సూర్యనారాయణ శ్రీనివాసరెడ్డికి రిలీవింగ్ లెటర్ అందజేశారు. రెస్క్యూ జీఎంగా నియమితులైనందున అభినందనలు తెలియజేశారు.

ఆర్జీ-3, ఏపీఏ బీఎంఎస్ ఉపాధ్యక్షుడిగా ప్రసాద్


అరుకాల ప్రసాద్

రామగిరి, జూన్ 30: సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆర్జీ-3, ఏపీఏ ఉపాధ్యక్షుడిగా అరుకాల ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం సెంటినరీకాలనీలో నిర్వహించిన బీఎంఎస్ జనరల్‌బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా యాదగిరి సత్తయ్య హాజరుకాగా, ఎన్నికల నిర్వహణ అధికారి మండ రమాకాంత్‌లు ప్రకటించారు. ఏరియాకార్యదర్శిగా రౌతు రమేశ్, సంయుక్త కార్యదర్శులుగా విద్యాసాగర్, బండారి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా వరరాజా ప్రసాద్, వెంకటేశ్వర్లు, క్యాతం మల్లికార్జున్, ట్రెజరర్, ఆఫీసు సెక్రెటరీ మామిడి స్వామి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బూర్ల లక్ష్మీనారాయణ, వేణుగోపాలరావు, సారంపాణి, ఎరవెల్లి రాణి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కమాన్‌పూర్, జూన్ 30 : మండలంలోని ముల్కపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సింగరేణి యాజమాన్యం ఓపెన్ కాస్ట్-1 ఉపరితల గని, ఆర్జీ3 ఏరియా వారి ఆధ్వర్యంలో గ్రామస్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఆర్జీ3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఎల్లవేళ ఉద్యోగులు, పరిసర గ్రామ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. అనంతరం గ్రామంలో రూ.4లక్షల 50వేలతో నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి బ్రాంచ్ సెక్రెటరీ రామచంద్రారెడ్డి, ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్‌ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటరమణ, ప్రాజెక్ట్ అధికారి రాదాకృష్ణ, ఎస్‌వోటు జీఎం జి రఘుపతి, పర్యావరణాధికారి రాజిరెడ్డి, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధికార ప్రతినిధి తొలగింపు

కళ్యాణ్‌నగర్, జూన్ 30: రామగుండం కార్పొరేషన్ ఆటో యూనియన్ అధికార ప్రతినిధి మాదాసు మనోహర్ అలియాస్ మణిని యూనియన్ నుంచి తొలగిస్తున్నట్టు అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్, ప్రధానకార్యదర్శి కండె కృష్ణ తెలిపారు. ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ యూనియన్ నిబంధనలు ఉల్లంఘించిన మనోహర్‌ను తొలగించడానికి సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు, అతనికి ఆటో యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే చోటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

సుభాష్‌నగర్, జూన్30: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఆదివారం రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో పలువురు సీనియర్ వైద్యులను సన్మానించారు. పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డితోపాటు నగరంలోని వైద్యులు పాల్గొన్నారు.

●వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, వైద్యులు దేవుడి మరో అవతారమని భగవతి విద్యాసంస్థల అధినేత బి రమణారావు అన్నారు. ఆదివారం వాసవీ వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో భగవతి పాఠశాలలో డాక్టర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ శృతి, డాక్టర్ రమ్య, డాక్టర్ సౌమ్య, డాక్టర్ కె సతీష్‌కుమార్, డాక్టర్ ఝాన్సిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎం స్వరూప, ఉపాధ్యక్షురాలు విశాల, జాయింట్ సెక్రటరీ హరిణి, ప్రిన్సిపాల్ బి విజయలక్ష్మీ, రాజమణి, తిరుపతమ్మ, మంజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ మిషన్ గడువు పొడిగింపుపై హర్షం

కరీంనగర్ టౌన్, జూన్ 30: స్మార్ట్‌సిటీ మిషన్ గడువును మార్చి 2025 వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల మేయర్ యాదగిరి సునీల్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మేయర్ ధన్యవాదాలు తెలిపారు. గడువు పొడగింపుతో మిగిలిన 20శాతం పనులు పూర్తయి కరీంనగర్ స్మార్ట్‌సిటీగా రూపొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రిగా సంజయ్ కుమార్ నగర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావాలని కోరారు.

● నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సిటీ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సినిమాటిక్ ఎడిటింగ్ ఫొటోగ్రఫీ కంపోజీషన్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ సునీల్‌రావును అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

సీఎండీ బలరామ్‌కు ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డు

- హైదరాబాద్‌లో ప్రదానం చేసిన గ్రీన్ మ్యాపుల్ సంస్థ


ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డు అందుకుంటున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, జూన్ 30: సింగరేణి సంస్థను పర్యావరణ హిత సంస్థగా మార్చడమే కాకుండా అందరిలోనూ పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు స్వయంగా 18వేలకు పైగా మొక్కలు నాటినందుకు గుర్తింపుగా సింగరేణి సీఎండీ ఎన్ బలరాంకు గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ 'ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ' అనే ప్రతిష్ఠాత్మక అవార్డును ప్రదానం చేసింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్-2024 అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగసంస్థల ఉన్నతాధికారులు సింగరేణి సీఎండీ ఎన్ బలరాంకు ఈ అవార్డును అందజేశారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రభుత్వరంగ, ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు, అందులోని ప్రభావశీల వ్యక్తులకు గ్రీన్ మ్యాపుల్ వారు ప్రతి ఏడాది ఇటువంటి ప్రోత్సాహక అవార్డులు అందజేస్తుంది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్ బలరామ్ స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటారని, సింగరేణి సంస్థ కూడా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటి పర్యావరణానికి మేలు చేస్తున్న సంస్థల్లో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ అధికారిగా ఉన్నత స్థాయిలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం ఒక్కడే 18వేల మొక్కలు నాటి 6 జిల్లాల్లో 35చిన్న అడవులుగా(మినీ ఫారెస్ట్) సృష్టించడం దేశంలోనే అత్యంత అరుదని కొనియాడారు. ఈ సందర్భంగా సీఎండీ బలరాం మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న తమ సంస్థ నిబంధనల ప్రకారం పచ్చదనాన్ని కాపాడడంతో పాటు స్వచ్ఛందంగా కూడా పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, సింగరేణి వ్యాప్తంగా 6కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు చెప్పారు. సింగరేణి సంస్థ చేస్తున్న పర్యావరణ హిత చర్యలకు గుర్తింపుగా 2021-22 సంవత్సరంలో కార్బన్ న్యూట్రాలిటీ కంపెనీగా సీఎంపీడీఐ గుర్తించిందని పేర్కొన్నారు. ప్రతీ అడుగు పచ్చదనం అన్న నినాదంతో సింగరేణిలో మొక్కలు నాటే యజ్ఞాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది వన మహోత్సవంలో మరో 2వేల మొక్కలు నాటాలని వ్యక్తిగత లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వివరించారు. కంపెనీలో ఈ ఏడాది 40లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. అలాగే పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు వీలుగా సింగరేణి పాఠశాలల్లో పర్యావరణ సిలబస్ను బోధిస్తున్నామని, ప్రతీ క్లాస్‌లోనూ గ్రీన్ కెప్టెన్లను నియమించి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్లు చెప్పారు. తనకు అవార్డును ప్రకటించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలుపుతూ ఈ అవార్డు సింగరేణిలోని పర్యావరణ హితులందరికీ చెందుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పర్యావరణ హిత కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ, ఆయిల్ ఇండియా తదితర కంపెనీల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర

- ఆర్జీ-3, ఏపీఏ ఇన్‌చార్జి పింగిళి సంపత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

రామగిరి, జూన్ 30: తెలంగాణలో అతి పెద్ద పరిశ్రమగా వెలుగొందుతున్న సింగరేణిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణకు కుట్ర చేస్తున్నాయని టీబీజీకేఎస్ ఆర్జీ-3, ఏపీఏ ఇన్‌చార్జి పింగిళి సంపత్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సెంటినరీ కాలనీలోని రఘువీరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొంగ నాటకాలను ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై 1నుంచి వివిధ తరహాలో వినూత్న నిరసన కార్యక్రమాలను చేపడు తున్నట్లు తెలిపారు. 1వ తేదీన నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టి గని మేనేజర్‌కు వినతిపత్రాలను అందజేస్తామన్నారు. 3న గనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహన కార్యక్రమం ఉంటుం దని పేర్కొన్నారు. 6న జీఎం కార్యాలయం ఎదుట ధర్నా, 9న గోదావరిఖనిలో మహా ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, యూనియన్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేశవరావు, శ్రీనివాస్, రమేశ్, వినయ్‌కుమార్, శివశంకర్, దాసరి మల్లేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కళ్యాణ్‌నగర్, జూన్ 30: ఆర్‌టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ చెప్పారు. ఆదివారం గోదావరిఖని ఆర్టీసీ డిపోను సందర్శించిన ఎమ్మెల్యే డ్రైవర్లు, కండక్టర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా కండక్టర్లు, డ్రైవర్లు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టారు. బీఆర్ఎస్ పాలనలో డ్రైవర్లు, కండక్టర్లపై విపరీతమైన పనిఒత్తిడి చేశారని, ఉద్యోగులపై అరాచకాలు చేస్తున్నారని, డిపోలో సీనియార్టీ పద్ధతిన ప్రతి విషయంలో పరిగణనలోకి తీసుకోవాలని, కానీ అలా చేయకుండా వారికి నచ్చిన వారికే విధులను కేటాయిస్తున్నారని, అనివార్య కారణాల వల్ల బస్సు ఫెయిల్ అయితే అది ఎన్నిగంటలు రిపేరు నిమిత్తం ఆగినా ఆ సమయాన్ని లెక్క చేయకుండా పూర్తి సర్వీస్‌ను పూర్తిచేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు.జూనియర్ డ్రైవర్లను వారికి ఇష్టంలేకున్నా టిమ్స్ డ్యూటీ చేయాలని, లేకపోతే వారిని డ్యూటీలోకి తీసుకోకుండా మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమస్యలపై దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్


ప్రజా పంథాలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న జూపాక శ్రీనివాస్

కళ్యాణ్‌నగర్, జూన్ 30: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు నంది రామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖనిలో జరిగిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సమసమానత్వం రావాలంటే, ప్రజల మధ్య నెలకొన్న అంతరాలు పోవాలంటే ప్రజలు చైతన్యం కావాలన్నారు. మోదీ ప్రభుత్వం మూడవసారి గద్దెనెక్కిన తరువాత ప్రశ్నించే గొంతులపై దృష్టి పెట్టిందని, ఉప చట్టాన్ని తలదన్నే విధంగా కొత్త చట్టాన్ని తీసుకువచ్చి ప్రశ్నించే గొంతులను అణగదొక్కాలని చూస్తుందన్నారు. దేశ సంపదను ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని, మోదీ విధానాలను అడ్డుకోవాలని, దీనికి ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం పెద్దంపేటకు చెందిన బండి అశోక్ ఆధ్వర్యంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథాలో యువకులు చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, లక్ష్మి, రమేష్, శంకర్, రాములు, వైకుంఠం, చంద్రయ్య, తేజేశ్వర్, తిరుపతి, రాయనర్సు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసం పార్కులు

కరీంనగర్ టౌన్, జూన్ 30: నగర ప్రజల ఆర్యోగమే ధ్యేయంగా తమ పాలకవర్గం పార్కులు, వాకింగ్ ట్రాక్స్, ఓపెన్ జిమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆన్‌స్టాలేషన్, కెబినెట్ సమావేశానికి మేయర్ సునీల్‌రావు ముఖ్యఅతిథిగా, కశ్మీరుగడ్డ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హాజరయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 23 వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నగరపాలక సంస్థ పాలకవర్గ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. నగరంలోని పార్కులు, మైదానాల్లో వాకింగ్ ట్రాక్స్, చాలా చోట్ల ఓపెన్ జిమ్స్‌ను, కోటి రూపాయలతో లోయర్ మానేరు డ్యాం సమీపంలో 1500 మీటర్ల వాకింగ్ ట్రాక్, లైటింగ్ ఏర్పాటు చేశామని అన్నారు. 35చోట్ల ఓపెన్ జిమ్స్‌ను ఏర్పాటు చేయగా ప్రజలు వాటిని సద్వినియోగంచేసుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కోటి 50 లక్షలతో మల్టిపర్పస్ పార్కును సుందరీకరించి ఈపీడీఎం వాకింగ్ నిర్మాణః చేస్తున్నామని చెప్పారు. 11 కోట్లతో పార్కు సుందరీకరిస్తున్నామని, జూలై చివరి వారంలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అంబేద్కర్ స్టేడియంలో 4 కోట్లతో సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ ం చేశామని, క్రీడాకోర్టులను, ఇండోర్ స్టేడియంను నిర్మించామని చెప్పారు. అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించే అధికారం మాకు లేదని, జిల్లా కలెక్టర్‌ను కలువాలని సూచించారు. స్థలం కేటాయిస్తే భవన నిర్మాణానికి నగరపాలక సంస్థ ద్వారా సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, డిస్ట్రిక్ట్ గవర్నర్ బాడీ మెంబర్ ఎల్లగౌడ్, కో ఆర్డినేటర్ అన్నమనేని సుధాకర్‌రావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ జగదీశ్వర్‌గౌడ్, డిప్యూటీ గవర్నర్ గొట్టిముక్కుల రవీందర్, రమణారెడ్డి, గౌతమ్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యావంతుల వేదిక సర్వసభ్య సమావేశం

కరీంనగర్ టౌన్, జూన్ 30: తెలంగాణ ఆర్యవైశ్య విద్యావంతుల వేదిక నాలుగవ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన టివివి వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లు చంద్రప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పోలీస్ హౌజింగ్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ కోలేటీ దామోదర్ హాజరై ప్రసంగించారు. ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేయాలని, పేద ఆర్యవైశ్యులకు చేయూతనివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం చైర్మన్ బుస్స శ్రీనివాస్, ఆవోపా రాష్ట్ర నాయకుడు గంజి స్వరాజ్‌బాబు, పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ ఉప్పల రామేశం, వైశ్య హాస్టల్ అధ్యక్షుడు కటకం భూమయ్య, నాయకులు సిరిపురం శ్రీనివాస్, కొమురవెల్లి సుధాకర్, మాడిశెట్టి గోపాల్, రాచమల్ల భద్రయ్య, గోగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 30: నగరంలోని జ్యోతినగర్, వేంకటాద్రి కాలనీ మహాలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి చతుర్థ వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉదయం నిత్య పూజలు, పద్మశాలీయుల సమాజం తరపున అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ భూదాతలు దేశ బోయిన వంశ కుటుంబ సభ్యులు, ఆలయ అధ్యక్ష, కార్య దర్శులు వేంకటేశ్వర్లు, వేదం, ఉపాధ్యక్షుడు గోపాలరావు, ప్రధానార్చకుడు దీవి కృష్ణకిషోర్, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

●అమ్మవార్లకు సారె సమర్పణలో ఆర్డీవో కుందారపు మహేశ్వర్, కాళేశ్వరం ప్రాజెక్ట్ మాజీ ఈఎన్‌సీ నల్ల వేంకటేశ్వర్లు, జిల్లా, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, గడ్డం శ్రీరాములు, పోపా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మల్లికార్జున్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ ఆడెపు శ్రీనివాస్, జిల్లా యువజన పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' నమోదులో లోపాలు

-ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న అర్హులు

గణేశ్‌నగర్, జూన్30: కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అరులందరికి అందడం లేదు. డేటా ఎంట్రీ సందర్భంగా ఆపరేటర్లు చేసిన తప్పిదాలు అర్హుల పాలిట శాపంగా మారాయి. ప్రభుత్వం ప్రకటించిన మేరకు అన్ని అర్హతలున్నా 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను ఉచితంగా పొందే అవకాశం చాలామంది కోల్పోయారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 8 నుంచి ఈ ఏడాది జనవరి 6 వరకు ప్రజాపాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. దర ఖాస్తుల్లో పథకాల లబ్ధి కోసం టిక్ పెడితే చాలు అని చెప్పడంతో దరఖాస్తుదారులు అదే పని చేశారు. డేటా నమోదులో కొన్ని పొరపాట్లు జరిగి గృహలక్ష్మి పథకానికి నాట్ అప్లయ్ అని ఎంట్రీ చేశారు. ఆ దరఖాస్తు దారులందకీ గృహ లక్ష్మి పథకం అందడం లేదు. ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో పొరపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండా పోయింది. ఓ వైపు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తుండగానే అధికారయంత్రాంగం ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించి జనవరి 5 నుంచి డేటా ఎంట్రీ మొదలుపెట్టింది. వేగంగా డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించడంతో ఆపరేటర్లు పొరపాట్లు చేశారు. చాలామందికి గృహజ్యోతి పథకం వర్తించడం లేదు. ఎంపీ డీవో కార్యాలయంలో, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కౌంటర్లు ఏర్పాటుచేసి మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. సిబ్బంది ఎడిట్ ఆప్షన్ లేదని చెప్పడంతో అర్హులు నిరాశ చెందుతున్నారు. అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధరణి సమస్యలకు పరిష్కారం చూపాలి

సుభాష్‌నగర్, జూన్ 30: ధరణి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటివ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ కోరారు. ఆదివారం ధరణి కమిటి చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఆ యాక్టను రెవెన్యూ శాఖ అధికారులు సక్రమంగా అమలు చేసేవిదంగా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రామారావుకు ఘన నివాళి

గణేశ్‌నగర్, జూన్ 30: నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి జిల్లా ప్రథమ కోఆర్డినేటర్, మాజీ రీజినల్ డైరెక్టర్ వేముగంటి రామారావు సంస్మరణ సభను ఆదివారం నెహ్రూ యువ కేంద్ర సమావేశం మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ ఉమ్మడి జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ టీవీ విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

ధర్మారం ఎస్సైగా లక్ష్మణ్ బాధ్యతల స్వీకరణ

ధర్మారం, జూన్30: ధర్మారం ఎస్సైగా శీలం లక్ష్మణ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన సత్యనారాయణను రామగుండం పోలీస్ కమీషనరేట్‌లో వెకెన్సీకి బదిలీ చేశారు. మంచిర్యాల టౌన్ ఎస్సైగా పనిచేస్తున్న లక్ష్మణ్‌ను ధర్మారం ఎస్సైగా నియమించారు. ఈమేరకు ఆదివారం ధర్మారం ఎస్సైగా లక్ష్మణ్ బాధ్యలు స్వీకరించారు.

ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, జూన్ 30: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రాసకొండ సదయ్యకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. ఇటీవల సదయ్య సెలూన్ షాప్‌పై గాలివానకు చెట్టు పడి కూలిపోయింది. దీంతో సదయ్య సుమారు లక్ష రూపాయల వరకు నష్టపోయాడు. ఈ విషయంపై స్పందించిన మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకుపోగా ఎమ్మెల్యే స్పందించి బాధితుడు సదయ్యకు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితుడు సదయ్యకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెదురీ రమేష్, మేడి అశోక్‌గౌడ్, కాల్వ వేమారెడ్డి, గుడ్ల సంపత్, రేకుల రఘు, విట్టం సంపత్, కుందేళ్ళ రవీందర్ పాల్గొన్నారు.

పాండవులగుట్టపై ప్రత్యేక పూజలు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 30: మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై ఉన్న జగత్ మహామునేశ్వర స్వామి ఆలయంలో యోగాచార్య సంపత్ కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బసవత్తుల రాజమౌళి ఆచార్యులు యోగాచార్య సంపత్ కుమార్‌ను పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు.

ఖోఖోతో అంతర్జాతీయ ఖ్యాతి

సుల్తానాబాద్, జూన్30: ఖోఖో క్రీడకు పుట్టినిల్లు అయిన సుల్తానాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు ఖ్యాతి తీసుకువచ్చారని ఖేలో ఇండియా కోచ్ గెల్లు మధూకర్ యాదవ్, జాతీయ స్థాయి ఖోఖో క్రీడాకారులు భైరగోని రవీందర్ అన్నారు. అంతర్జాతీయ ఖో ఖో క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలోని తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణంలోని ఖేలో ఇండియా ఖో ఖో శిక్షణ కేంద్రంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, ఖేలో ఇండియా కోచ్ గెల్లు మధుకర్ యాదవ్, జాతీయ స్థాయి క్రీడాకారులు భైరగోని రవీందర్ మాట్లాడుతూ ఖోఖో ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఎనలేని ఖ్యాతి ఘనత దక్కిందన్నారు. 2036లో భారత్ ఆతిథ్యమిస్తున్న ఒలింపిక్స్ క్రీడల్లో ఖోఖోకు చోటు దక్కడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ క్రీడాకారులు కోచ్, అంతర్జాతీయ క్రీడాకారులు గెల్లు మధూకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిలివేరి మహేందర్, ఎక్బాల్, ఫిజికల్ డైరెక్టర్ ప్రణయ్, గజబీంకార్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

కమాన్‌పూర్, జూన్ 30 : మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆదివరాహస్వామి సన్నిధిలో ఆదివారం మువ్వ గోవ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమి విజయ వారి సౌజన్యంతో చిన్నారులు నృత్యప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి చిన్నారులు హాజరై నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి విదార్థికి అకాడమి తరపున మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వర ప్రసాద్ ఆచార్యులు భూపల్లి జ్యోతి, మల్లేష్, బొజ్జ నరసింహచారి, కొలిపాక లక్ష్మీ, అకాడమి నిర్వాహకులు నందిరాజు, అరుణ, కల్యాణి, సాయి, నరసింహ, కృష్ణ తదితరులు ఉన్నారు.

గోవుల సంరక్షణకు విరాళం

సుల్తానాబాద్, జూన్ 30: సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద అంజనేయస్వామి ఆలయం వెనుకు ఉన్న గోశాల నిర్వాహకులకు ఆదివారం పదివేల రూపాయల విరాళాన్ని సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ వారు అందజేశారు. గోశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుల్తానాబాద్ మాజీ జడ్పీటీసీ అయిల రమేష్, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్, మాజీ ఎంపీటీసీ పల్లా సురేష్, వాకర్స్ అసోసియోషన్ ప్రదాన కార్యదర్శి మంద శ్రీనివాస్, కొలిపాక రవీందర్, మల్లేశం, చేతుల మీదుగా గోశాల నిర్వాహకులు బండారి సూర్యకు అందజేశారు.

మైసమ్మకు పూజలు

ధర్మారం, జూన్30: ధర్మారం మండల కేంద్రంలో గల పెద్దపల్లి-ధర్మారం రహదారిలో ఏర్పాటు చేసిన మైసమ్మ విగ్రహానికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మ వారికి బోనం నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నార రాజేందర్, ప్రేమ్‌సాగర్, విద్యాసాగర్, సంజీవ్, కొంరయ్య తోట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

పాలకుర్తి, జూన్ 30: మండలంలోని జయ్యారం అంకమెట్టుకు ఉన్న ప్రసిద్ధ పెద్దయ్య, చిన్నయ్య ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. ఆదివారం ఆలయంలో జరిగిన పట్నాల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 45 రోజుల్లో బండల వాగు ప్రాజెక్టును పూర్తి చేసి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు జరుగుతున్న పనుల్లో వేగం పెంచామన్నారు. డప్పుచప్పుళ్ల, డోలు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, తదితరులు పాల్గోన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు ఈసాలతక్కళ్లపల్లిలోని పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్,వైస్ ఎంపిపి ఎర్రం స్వామి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సాన రామకృష్ణారెడ్డి



క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన సాన రామకృష్ణారెడ్డి

కమాన్‌పూర్, జూన్ 30: కమాన్‌పూర్ నూతన లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా జూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్‌కు చెందిన సాన రామకృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లయన్స్‌క్లబ్ కమాన్‌పూర్ 2వ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా స్థానిక సాన రామకృష్ణారెడ్డి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టాలేషన్ అధికారి సింహరాజు కోదండరాం క్లబ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి శంకర్, కోశాధికారిగా డాక్టర్ పి. విజయ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఇండక్షన్ ఆఫీసర్ వేల్పురి సంపత్‌రావు, బండ బాబురావు, ఉట్ల అశోక్, గుంత వినోద్, సభ్యులు ఇనగంటి భాస్కరరావు, కోలేటి మారుతి, బొజ్జ రాజసాగర్, చౌడవరపు లింగమూర్తి, తిమ్మరాజు, శరత్‌కుమార్, అనవేణి లక్ష్మీరాజం, చెప్పాలా సమ్మయ్య, అంజయ్య, బండి సాయి శంకర్, పొన్నం నవీన్, చొప్పరి సంపత్ తదితరులు ఉన్నారు.